క్లుప్తంగా

బీసీ మహిళపై దాడి అమానుషం


తాడిబోయిన వేణుగోపాల్

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ వర్గాలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్ మండి పడ్డారు. గుంటూరు నగరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గుడివాడలో జిల్లాపరిషత్ చైర్మన్ హారికపై టీడీపీ గుండాలు చేసిన దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు కూటమి పాలనలో నిత్యకృత్యమయ్యాయని దుయ్యబట్టారు. కనీసం మహిళ అనే విచక్షణ లేకుండా టీడీపీ గుండాలు ఆమె కారును ధ్వంసం చేసి దుర్భాషలాడడం సిగ్గుచేటన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో ఇటీవల బొనిగల నాగమల్లేశ్వరరావు జరిగిన దాడి ఎంత ఘోరంగా ఉందో ప్రతి ఒక్కరికి తెలిసిన అంశమేనన్నారు. రాజకీయాలకతీతంగా హారికపై జరిగిన దాడిని బీసీ సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి

లక్ష్మీపురం: భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న ఈ సందర్భంలో మహాసభలు జరగడం ప్రాధాన్యం సంతరించుకుందని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. ఏటీ అగ్రహారం, కమ్యూనిస్టు కాలనీ శాఖ సమితి సభ్యులు మంగ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత కాలనీలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యులు మేడా హనుమంతరావు మాట్లాడారు. అనంతరం డివిజన్ పరిధిలో ఏడుగురితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా రెడ్డయ్య(చిన్న), సహాయ కార్యదర్శిగా వాసు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఎ.అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్ల మరియదాసు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను మభ్యపెట్టే కార్యక్రమాలు మానుకోవాలి



నెహ్రూనగర్: శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం రిజిస్టర్ సొసైటీ ద్వారా ఆమోదించిన బైలాస్, మినిట్స్‌కు వ్యతిరేకంగా ఎటువంటి గుర్తింపు లేని కొంత మంది ఈ నెల 20వ తేదీన మహాజన సభ పేరుతో చట్ట వ్యతిరేకంగా మభ్యపెట్టే ప్రయత్నాలను మానుకోవాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని దేశీ విశ్వబ్రాహ్మణ సమాజం ప్రాంగణంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా సాగిపోతున్న దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం సొసైటీని విచ్ఛిన్నం చేయాలని ఉద్దేశంతో 20వ తేదీన మహాజన సభ పేరుతో విశ్వబ్రాహ్మణులను మభ్యపెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో సంఘ గౌరవ సలహాదారు చామర్తి శంకర్ శాస్త్రి, ఉపాధ్యక్షులు పూసపాటి శేషగిరిరావు, సభ్యులు కొమ్మూరి కృష్ణమూర్తి, నిమ్మగడ్డ సుబ్బారావు, సిద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రారంభమైన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు


మాట్లాడుతున్న సువీరానందస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీమద్భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. జరుగుల బంగారుబాబు, శివకుమారి గార్ల సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచించారు.

జీతాలు పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలి

నెహ్రూ నగర్: రాష్ట్ర వ్యాప్తంగా నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయకుంటే తిరిగి సమ్మెలోకి వెళ్తామని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మునిసిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు స్పష్టం చేశారు. సోమవారం విజయవాడలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి నాగిపోగు సుమన్, గుంటూరు నగరపాలక సంస్థ కమిటీ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటి బాబు, కార్య నిర్వాహక కార్యదర్శి గాలి యేసు బాబు, యూనియన్ సభ్యులు రమాదేవి, కోటేశ్వరమ్మ, ఎస్తేరు, కుమారి పాల్గొన్నారు.

స్వచ్ఛ ర్యాంకులు సరే...

పారిశుద్ధ్యం ఎక్కడ సారూ...!

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంక్
- పారిశుద్ధ్యం మెరుగు అంతంత మాత్రమే
- రోడ్లుపై ఎక్కడ చూసిన చెత్త కుప్పలే


శారదాకాలనీ 25వ లైన్ వద్ద చెత్త బుట్టలో చెత్త వేసి రోడ్డు పక్కన పెట్టిన పారిశుద్ధ్య కార్మికులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య విభాగంలో ర్యాంకుల పంట పండింది. మొన్న రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో, నగరపాలక సంస్థల్లో నిర్వహించిన ఐవీఆర్ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం)లో నగరపాలక సంస్థ రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిచింది. నిన్న కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీలో ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో గుంటూరు నగరపాలక సంస్థకు అవార్డు వచ్చింది. కాని గ్రౌండ్ లెవల్‌లో నగరంలో ఎక్కడ కూడా ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదనే చెప్పుకోవచ్చు. ముఖ్యంగా నగరంలో ఎక్కడ చూసిన ఏదో ఒక మూలన చెత్త కుప్పలు కుప్పలుగా కనిపిస్తూనే ప్రజలకు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు లేకపోలేదు.

శివారు ప్రాంతాల్లో తూతూ మంత్రంగా ఇంటింటి చెత్త సేకరణ

నగరంలో సుమారు 3 లక్షల గృహాలు ఉన్నాయి. వీటికి గాను నగరంలో 52 శానిటరీ డివిజన్లు ఉన్నాయి. 802 మైక్రో ప్యాకెట్స్ ఉన్నాయి. రోజుకి నగరంలో ఉత్పన్నమయ్యే చెత్త 470 మెట్రిక్ టన్నులు కాగా పనిచేసే కార్మికులు సుమారు రెండు వేల మంది మాత్రమే. అయితే ఐవీఆర్ఎస్‌లో ప్రజలను అడిగిన ప్రశ్నల్లో ప్రతి రోజు ఇంటి నుంచి చెత్త సేకరణ సేకరిస్తున్నారా.. లేదా, మీ ఇంటి పరిసరా ప్రాంతాల్లో చెత్త కుప్పలను 24 గంటల్లో తొలగిస్తున్నారా లేదా.. డ్రెయిన్లు శుభ్రం చేస్తున్నారా లేదా మూడు అంశాలపై ప్రశ్నలు అడిగారు. ఇందులో 67 శాతం రెస్పాన్స్‌తో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచిందని చెప్పుకుంటున్న అధికారులు వాస్తవంగా శివారు ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ తూతూ మంత్రంగా జరుగుతుందని చెప్పుకోవచ్చు. ఒక్క రోజు వస్తే రెండు, మూడు రోజులు దాకా పారిశుద్ధ్య కార్మికులు రాని పరిస్థితి నెలకొంది. దీనికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ల, శానిటరీ సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది.

రోడ్డు మీదే చెత్త వేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నగరంలో చెత్తకుప్పలు సంగతి చెప్పనవసరమే లేదు.. చెత్త కుప్పలు రోడ్డు మీద వేయడానికి వీల్లేదని నగర కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఇందుగాను రోడ్డు మీద చెత్త వేయకుండా సుమారు 350 స్పాట్స్‌ను గుర్తించి అక్కడ గ్రీన్ మ్యాట్స్ కట్టి చెత్త వేయకుండా పర్యవేక్షణ చేయాలని ప్రజారోగ్య అధికారులకు బాధ్యతలు అప్పగించారు. చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించేందుకు 57 ట్రాక్టర్లు డివిజన్‌కు ఒకటి కేటాయించామని చెబుతున్న అధికారులు ఆ ట్రాక్టర్ల ఎప్పుడు వస్తాయో తెలియక చెత్తను డస్ట్ బిన్స్‌లో ఉంచలేక..ఇళ్ల నుంచి సేకరించే చెత్త సకాలంలో సేకరించలేక..రోడ్డు మీదే పారిశుద్ధ్య కార్మికులు చెత్త వేయాల్సిన పరిస్థితి నెలకొంది.

వసూళ్ల పర్వం ఆపితేనే..మెరుగు

నగరపాలక సంస్థ పరిధిలో సుమారు రెండు వేల మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో సుమారు 250 మందికిపైగా పర్మినెంట్ కార్మికులు పనిచేస్తున్నారు. అయితే పర్మినెంట్ కార్మికులు విధుల్లో కనిపించే పరిస్థితి ఉండదు. మస్టర్ వేసుకుని వేసుకుని వెళ్లిపోవడం జీతం రాగానే నెలకు ఇంత అని ప్రజారోగ్యధికారులకు సమర్పించుకోవడం..అదే విధంగా అవుట్ సోర్సింగ్ వర్కర్లు కూడా కొంత మంది నుంచి నెల మామూళ్లు వసూలు చేస్తుండటంతో వారంతా పైపైన పనులు చేసుకుంటు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల జరిగిన జిల్లా రివ్యూ మీటింగ్ సమావేశంలో ప్రజారోగ్య అధికారుల పేరుతో పారిశుద్ధ్య కార్మికుల నుంచి వసూళ్లు చేస్తున్నారని కొంత మంది ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రజారోగ్య విభాగంలో ఏదైన కార్యక్రమం చేపట్టాలంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్ తలా ఇంత అని ఫిక్స్ చేసి వసూలు చేస్తుంటారు ప్రజారోగ్యధికారులు..వీరంతా కూడా పారిశుద్ధ్యం కార్మికుల వద్ద నుంచే వసూళ్లు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వసూళ్ల పర్వాన్ని కట్టడి చేసి.. పారిశుద్ధ్యంపై స్పష్టమైన నిఘా ఉంచగలిగితే పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుపడుతుందే తప్ప ఈ విధంగా ర్యాంకులతో నగరంలో శుభ్రపడదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, జనన, మరణ నమోదు విభాగం వద్ద పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 22 ఫిర్యాదులు తీసుకున్నారు. పీజీఆర్ఎస్‌లో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 5, ప్రజారోగ్య విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 2, పరిపాలన విభాగానికి 2, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పున మొత్తం 37 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, ఎంహెచ్‌ఓ(ఇన్‌చార్జి) రామారావు, సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

వేడి గాలులకు మంగిపోయిన అర్జీదారులు

పీజీఆర్ఎస్ కార్యక్రమం ప్రతి సోమవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తుంటారు. అయితే కౌన్సిల్ హాల్‌లో బీఎల్ఓలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శిక్షణ తరగతులు నిర్వహించడంతో పీజీఆర్ఎస్‌ను నగరపాలక సంస్థ జనన, మరణ నమోదు కార్యక్రమం ముందు నిర్వహించారు. అయితే ఒక భానుడి భగభగలతో వేడి గాలులు రావడంతో ఇటు అర్జీదారులు, అటు అధికారులు ఉక్కపోతతో అల్లాడిపోయారు.

బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీపై ప్రజలకు వివరించాలి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా


డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ప్రజలకు మాట ఇచ్చి చేతల్లో విఫలమైన బాబూ ష్యూరిటీ పక్కాగా ఉంటుందని వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఎద్దేవా చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో సోమవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఇప్పటికే బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ జరిగిందని, డివిజన్ స్థాయిలో ప్రజలకు బాబు మోసాలపై అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఏ విధంగా ప్రజల్లోకి వెళ్లాలి, వారికి సూపర్ 6 పథకాలు, బాబు హామీల గురించి తెలియజేస్తూ ముందుకు ఏవిధంగా సాగాలనే అంశంపై డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు దృష్టి సారించాలని కోరారు. అదే విధంగా 2024 ఎన్నికల్లో తప్పుడు వాగ్దానాలు చేసి అమలు చేయలేని పరిస్థితులను ప్రతి ఒక్కరికి క్షుణ్ణంగా వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. అబద్ధపు హామీలను తెలియజేసి, ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం లక్ష్యంగా పనిచేయాలన్నారు. కూటమి నేతల వేధింపులకు, పెట్టే ఇబ్బందులకు భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ఎలాంటి ఇబ్బంది కలిగినా పార్టీ శ్రేణులు అండగా ఉన్నారన్న విషయం గుర్తించాలని కోరారు.

కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ


సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

లక్ష్మీపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె సోమవారానికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి నారాయణ ప్రకటించారని, ముఖ్యమంత్రి ఆదేశించిన తర్వాత ఇంకా ఆలస్యం చేయటం ఏమిటని ఎద్దేవా చేశారు. మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి పని చేస్తూ పట్టణ ప్రజలకు మంచినీరు, పారిశుద్ధ్యం అందిస్తున్నారని, అలాంటి వారికి జీతాలు పెంచకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం ఏమిటని అన్నారు. గత సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాలకు జీఓలు ఇవ్వాలని సంవత్సరం నుంచి కోరుతున్నా జీఓలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్, అధికారులు కార్మికులను షోకాజ్ నోటీసులు అంటూ, పనిలో తొలగిస్తామని భయపెట్టడం హేయమైన చర్య అని అన్నారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఒ.నారాయణరెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని అన్నారు. బీసీ బహుజన ఫ్రంట్ కన్వీనర్ తాడికొండ నరసింహారావు మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకుంటూ వారికి ఇవ్వవలసిన కనీస వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయమని అన్నారు. రెండో రోజు సమ్మెలో గుంటూరు నగరపాలక సంస్థలోని వాటర్ వర్క్స్ కార్మికులు, లీకు వర్కర్స్, టౌన్ ప్లానింగ్ దళం, సెక్యూరిటీ గార్డులు, పార్క్ గార్డెనర్స్ పాల్గొన్నారు. ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు ఆది నికల్సన్, షేక్ ఖాసీం వలి, కార్మికులు పాశం పూర్ణచంద్రరావు, కాటంరాజు, సిద్దా బత్తిన శ్రీనివాసరావు, జి సురేష్ బాబు, బాలకష్ణ యాసిడ్ ఖాన్, కాశయ్య, సలాం, భాష, మహేష్, సుబ్రహ్మణ్యం, ఆర్ముగం, నాగరాజు, దుర్గారావు, ఏసు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయ అభివృద్ధికి చర్యలు


ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: పర్యావరణ హితంగా గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని అభివృద్ధి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేయర్, కమిషనర్ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం నీరు రాకుండా అవసరమైన మేరకు మెరక చేయాలన్నారు. కార్యాలయ ఆవరణలో మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతంలో నీడనిచ్చే మొక్కలు నాటడడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గేట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆఫీస్ ఎలివేషన్ వర్క్‌కి మోడల్స్ తీసుకురావాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టీ, ఈరంటి వరప్రసాద్, మీరావలి, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారం రోజుల్లో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ ప్రకారం చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్ట్

1400 గ్రాములు గంజాయి స్వాధీనం

పెదకాకాని: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన ఇంటూరు కిరణ్, షేక్ సమీర్‌భాషా, గుంటూరుకు చెందిన సయ్యద్ చిన్న భాషాలు.. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం ప్రాంతంలోని చింతపల్లికి చెందిన గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 1500 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. అందులో 1400 గ్రాముల గంజాయిని పెదకాకాని వై జంక్షన్ శివారులో చిన్న చిన్న ప్యాకెట్‌లుగా తయారు చేస్తుండగా పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు పెదకాకాని సీఐ టి.పి.నారాయణస్వామి తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం


మేడ్ సభ్యులతో నాగసుశీల, హర్షిత తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్న మేడ్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు విస్తృతం కావాలని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తెలిపారు.

సోమవారం జేకేసీ కళాశాలలో ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ విభాగ ఆధ్వర్యంలో మేక్ ఏ డిఫరెన్స్(మేడ్) స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకలాపాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా మేడ్‌లో భాగస్వాములైన వివిధ కార్పొరేట్ ఉద్యోగులతో పాటు మెడికల్, బీటెక్ విద్యార్థులు ఎండీ అఫ్రోజ్, కె.సంజన, బి.యువ తరుణ్, శ్రీనిత్య, సుజయ్, యాస్మిన్, సాయి రమేష్ జేకేసీ కళాశాల విద్యార్థులతో తమ అనుభవాలు పంచుకున్నారు. అనాథలు, వికలాంగులతో పాటు ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు తాము చేయూత ఇస్తామని వివరించారు. ఒక విద్యార్థిని ఐదుగురు చొప్పున విద్యార్థులు దత్తత తీసుకుని, గణితం, వ్యక్తిత్వ వికాసం, భాషా, భావ వ్యక్తీకరణ నైపుణ్యం అంశాల్లో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు శిక్షణ కల్పిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భయం, బిడియం పోగొట్టి, స్పీకింగ్ స్కిల్స్‌ను అభివృద్ధి పర్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ వైస్ చైర్మన్ పి.నాగసుశీల, కమిటీ ఆర్గనైజర్ కె.హర్షిత, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, భారతీయ భాషాశాఖల అధిపతి డాక్టర్ వై.ప్రశాంతి పాల్గొన్నారు.

ఆర్వోబీ పిల్లర్ గుంతలో పడిన వృద్ధుడు



నెహ్రూనగర్: శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు ప్రారంభమయ్యాయి. దీని కోసం జీజీహెచ్ ఎమర్జెన్సీ గేటు ముందు, అరండల్‌పేట మూడో లైను వద్ద పెద్ద పెద్ద గుంతలు తీసి పిల్లర్లు వేస్తున్నారు. అయితే, వీటి వద్ద రక్షణ కోసం సరైన ఏర్పాట్లు చేయలేదు. పనులను చూసేందుకు ఓ వృద్ధుడు అక్కడికి సోమవారం ఉదయం వచ్చాడు. అంచు వరకు వెళ్లి పనులను పరిశీలిస్తున్న క్రమంలో ఒక్కసారి మట్టి పెళ్లలు ఊడిపోయి కింద గుంతలోకి పడిపోయాడు. వెంటనే స్థానికులు స్పందించి అంబులెన్స్‌కు ఫోన్ చేసి, ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. పెద్దఎత్తున పనులు చేపడుతున్న అధికారులు, వీటి వద్ద సరైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పనులు జరిగే సమయంలో సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

తూర్పులో ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. 'తూర్పులో ఎంఈఓ కార్యాలయమేది' అనే శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. తూర్పు, పశ్చిమ ఎంఈఓ కార్యాలయాలు ఒకే చోట కొనసాగుతున్నప్పటికీ పరిపాలన సౌలభ్యం కోసం వేర్వేరుగా విభజించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, త్వరలోనే తూర్పు నియోజకవర్గంలో ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

72 మంది ఆప్కాస్ వర్కర్లకు షోకాజ్ నోటీసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అవుట్ సోర్సింగ్ పద్ధతి(ఆప్కాస్)లో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న 72 మంది కార్మికులకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం రాత్రి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారించాలంటూ రెండు రోజుల నుంచి సిబ్బంది విధులకు గైర్హజరయ్యారు. ప్రజలకు అందించే అత్యవసర సేవలైన తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగిస్తూ విధులకు 72 మంది గైర్హజయ్యారు. కార్మికులు విధులకు హాజరు కాకపోవడం వలన నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగి ప్రజలు ఇబ్బందులు పడిన నేపథ్యంలో విధులకు హాజరు కాని 72 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తక్షణమే విధులకు హాజరు కాకుంటే ఆప్కాస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

పవర్ లిఫ్టర్లను అభినందించిన మేయర్



నెహ్రూనగర్: జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో గుంటూరు జిల్లా ఖ్యాతిని చాటిన క్రీకారులను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అభినందించారు. పవర్ లిఫ్టింగ్‌లో వివిధ మెడల్స్ సాధించిన గుంటూరు జిల్లాకు చెందిన బొలినేని చంద్రిక, షేక్ సాదియా, అల్మస్, నాగం జ్ఞాన దివ్య, మందిర షానూన్‌లను సోమవారం మేయర్‌ను నగరపాలక సంస్థ కార్యాలయంలో కలిశారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని ధావన్‌గిరిలో నిర్వహించిన జూనియర్, సీనియర్ నేషనల్ ఎక్యూప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలో ఆంధ్రప్రదేశ్ తరపున గుంటూరు జిల్లా పవర్ లిఫ్టర్లు బోలినేని చంద్రిక సీనియర్(సిల్వర్ మెడల్), షేక్ సాదియా అల్మస్ జూనియర్(గోల్డ్ మెడల్), నాగం జ్ఞాన దివ్య, మందిర షానూన్, జూనియర్ బ్రాంజ్ మెడల్ సాధించిన నేపథ్యంలో వారిని నగర పాలక సంస్థ తరుపున ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొని, గోల్డ్ మెడల్స్ సాధించి, గుంటూరు జిల్లా ఖ్యాతిని పెంపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కర్ రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని పాల్గొన్నారు.

తెలుగు ప్రేక్షకులలో కోట శ్రీనివాసరావుకు ప్రత్యేక స్థానం

లక్ష్మీపురం: సుమారు నాలుగు దశాబ్దాల పాటు సినీ నాటక రంగాలకు విశేష సేవలందించి వైవిధ్య భరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల మదిలో కోట శ్రీనివాసరావు శాశ్వత ముద్ర వేసుకున్నారని అవగాహన సంస్థ సాంస్కృతి కార్యక్రమాల కన్వీనర్ అశోక్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామి రెడ్డి, పాడుదాం రండి బృందం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలక్షణ నటనతో సినీ ప్రియుల్ని మెప్పించి చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేసిన నట దిగ్గజం కోట శ్రీనివాసరావు ఇక లేరనే వార్తను సినీ ప్రియులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. నాటక రచయిత కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ 1970 నుంచి తెలుగు తెరపై రాణించిన మేటి నటుడు కోట శ్రీనివాసరావు అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): డీ–13 సెక్షన్(ఆర్‌టీసీ కాలనీ) పరిధిలోని 11 కేవీలో మెయింటెనెన్స్ దృష్ట్యా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈఈ పీహెచ్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. సీతారామ నగర్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రైవర్‌కు గాయాలు

పొన్నూరు: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కూల్ డ్రింక్స్ లోడుతో వెళుతున్న ఆటో బోల్తా పడిన సంఘటన సోమవారం మండలంలోని కట్టెంపూడి ప్రధాన రహదారిలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో ఆటోలోని కూల్ డ్రింక్స్ సీసాలు కింద పడడంతో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.